
వేములవాడ: తెలంగాణ చౌక్‌లో నినదిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


మానకొండూర్: సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మాజీ జడ్పీటీసీ శేఖర్‌గౌడ్, పార్టీ నాయకులు





కరీంనగర్: తెలంగాణచౌక్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, పక్కన మేయర్ సునీల్‌రావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, కార్పొరేటర్లు, నాయకులు



# రైతుకోసం రణం

- వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో కదిలిన దండు
- రైతులతో కలిసి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధర్నా, రాస్తారోకోలు
- కాంగ్రెస్ సర్కారుపై యుద్ధం
- వెంటనే పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్

## గర్జించిన బీఆర్‌ఎస్

బీఆర్‌ఎస్ దండు కదిలింది. కాంగ్రెస్ సర్కారు మోసంపై కన్నెర్రజేసింది. గత ప్రభుత్వంలో విజయవంతంగా అమలైన రైతు భరోసా(రైతు బంధు) 'ఈ వానకాలం లేదు. వచ్చే యాసంగి నుంచి అమలు చేస్తామన్న' మంత్రి తుమ్మల ప్రకటనపై భగ్గుమన్నది. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం కరీంనగర్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనలకు దిగింది. అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు చేసింది. పలుచోట్ల సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేసింది. గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినదానికంటే ఎక్కువగా ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్, ఇప్పటివరకు ఒక్క పంటకు కూడా ఇవ్వకపోవడంపై ఆగ్రహించింది. వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేసింది.



జగిత్యాల: ధర్నా చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతను అడ్డుకుంటున్న పోలీసులు


ధర్మపురి: నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, నాయకులు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని సిరిసిల్ల మానేరు బ్రిడ్జిపై బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మాజీ ఎంపీపీ మానస, రాజు, మాజీ జడ్పీటీసీ అంతయ్య, మధు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి రాస్తారోకో చేశారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో జరిగిన ధర్నాలో మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు, శరత్‌రావు, నాయకులు అన్వర్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, గంభీరావుపేట మండల కేంద్రంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, లక్ష్మణ్, లింగన్నగారి దయాకర్‌రావు, రాజు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో పార్టీ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, గుండారపు కృష్ణారెడ్డి, అందె సుభాష్, కొండ రమేశ్, వీర్నపల్లిలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, గుజ్జుల రాజిరెడ్డి, బంజార సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేశ్‌నాయక్ పాల్గొన్నారు. వేములవాడ తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన ధర్నాలో బీఆర్‌ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గోస్కుల రవి, ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతికుమార్, సెస్ చైర్మన్ దేవరాజు, గడ్డం హనుమాండ్లు, బాల్‌రెడ్డి, నిమ్మశెట్టి విజయ్, శంకర్, వేములవాడ రూరల్ మండలంలో మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, ఆర్‌సీరావు పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లాలోని దాదాపు అన్ని మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు రైతులతో కలిసి ఆందోళనలు చేపట్టారు. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు

### నమ్మించి గొంతు కోసిన రేవంత్ సర్కార్

కాంగ్రెస్‌కు ఓట్లు వేసినందుకు రేవంత్ సర్కారు నమ్మించి రైతుల గొంతు కోసింది. రైతులతోపాటు అన్ని వర్గాలను ంగ్రెస్ వంచించింది. మాటలు గారడీ చేస్తూ కాంగ్రెస్ పార్టీ గత ప్రభుత్వాన్ని, కేసీఆర్‌ను తిట్టడమే కార్యక్రమంగా పెట్టుకున్నది. వానకాలం రైతు భరోసా వస్తుందని రైతులు ఆశపడి అప్పులు తెచ్చి సాగు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన తర్వాత అప్పు చెల్లించవచ్చని అనుకున్నారు. కానీ, కోతలు అయిపోయి కల్లాల వద్దకు వడ్లు తరలిస్తున్న సమయంలో రైతు బరోసా ఇవ్వకపోవడమే కాకుండా వచ్చే సీజన్‌లో ఇచ్చేందుకు సబ్‌కమిటీ నివేదిక ప్రకారం నిర్ణయం ఇస్తామని చెప్పి రైతుల ఆశలను అడియాసలు చేసింది. సావు కబురు చల్లగా చెప్పారు. ఒక రైతులనే కాకుండా నిరుద్యోగ యువత, మహిళలు, ఉద్యోగులు, సింగరేణి కార్మికులను కూడా ఈ సరారు మోసం చేసింది.

- మాజీ మంత్రి కొప్పుల



పెద్దపల్లి: రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, రైతులు, నాయకులు



గంగాధర: మధురానగర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, నాయకులు


మంథని: అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


చిగురుమామిడి: హుస్నాబాద్‌లో నినదిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, నాయకులు


అంతర్గాం: నినదిస్తున్న బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, నాయకులు


సిరిసిల్ల టౌన్: చంద్రంపేట చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, స్థానిక నాయకులు


హుజూరాబాద్ టౌన్: అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


కోరుట్ల: కొత్త బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు


మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, వేదికపై మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, నాయకులు

# కలిసికట్టుగా పోరాడుదాం

- మళ్లీ కేసీఆర్ పాలన తెద్దాం
- కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత వస్తోంది
- ముందుండి ప్రజలను నడిపించే బాధ్యత తీసుకుందాం
- కార్యకర్తలకు అండగా ఉంటాం
- ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు
- పాటనే ఆయుధం చేసి మరో పోరాటానికి సిద్ధమవుతున్న రసమయి
- బీఆర్‌ఎస్ అలయ్ బలయ్ సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు

కరీంనగర్, అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ): కలిసికట్టుగా పోరాడి మళ్లీ కేసీఆర్ పాలన తెచ్చుకుందామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు బీఆర్‌ఎస్ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఆదివారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని సాయిరాం గార్డెన్స్‌లో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అధ్యక్షతన జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల అలయ్.. బలయ్ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో 2001 నాటి రోజులు గుర్తుకు వస్తున్నాయని, అప్పటి ఉత్సాహం, ఆనాటి స్ఫూర్తి కార్యకర్తల్లో కనిపిస్తోందన్నారు. ఇదే ఉత్సాహంతో ప్రజలను దగా చేస్తున్న కాంగ్రెస్ సర్కారుపై కలిసి కట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. గతేడాది డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని, వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు, 13 హామీలు నెరవేర్చుతామన్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలన 300 రోజులకు చేరినా ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేక పోయిందని మండిపడ్డారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరోనా వచ్చినా.. కష్టం వచ్చినా సమయానికి 11 విడుతల్లో రూ.72 వేల కోట్లు రైతుబంధు ఇచ్చామని, ఒక్కసారికే రేవంత్‌రెడ్డికి ఎట్లా ముక్కులకు వస్తుందని ప్రశ్నించారు. అంటే రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేకి అనేది స్పష్టంగా తేటతెల్లమైందని స్పష్టం చేశారు. రైతులను శక్తి ఏంటో చూపిస్తేనే రైతు భరోసా ఇస్తారని సూచించారు. మహిళలకు రూ.2,500 చొప్పున పది నెలల పాలనలో ప్రతి మహిళకు కాంగ్రెస్ సర్కారు రూ.25 వేలు బాకీ పడిందని, ఈ విషయాన్ని ప్రతి మహిళకు చెప్పాలన్నారు. బతుకమ్మ పండుగకు రెండు చీరెలు ఇస్తామని చెప్పి ఉన్న చీర ఎగబెట్టారని మహిళలే అంటున్నారని, వారి కోసం చేసిన ఒక్క బస్సు తప్ప అంతా తుస్సేనని, ఆ బస్సు కూడా ఆగమాగమే ఉందన్నారు. ఆసరా పింఛన్లు రూ.4 వేలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి పది నెలల పాలనలో రెండు నెలల పింఛన్లు ఎగవేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ కరెంట్ కష్టాలు మొదలయ్యాయని, కరెంట్ మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా దిక్కులేని పరిస్థితి నెలకొన్నదన్నారు. రుణమాఫీ పూర్తి చేశామని చెప్పి బీఆర్‌ఎస్ నిలదీయగానే వాయిదాలు వేస్తూ వస్తున్నారని, మానకొండూర్ నియోజకవర్గంలో ఏ ఒక్క ఊరికి వచ్చి పూర్తి స్థాయిలో రుణమాఫీ చేశామని నిరూపించే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి ఉందా? అని సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ అంటున్నారని, అది కూడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితేనే వర్తిస్తుందని చెబుతున్నారని, మిల్లర్లే రైతుల వద్దకు వెళ్లి రూ.3 వేలకు క్వింటాల్ చొప్పున సన్న వడ్లు కొంటుంటే బోనస్ ఎందుకుని, ఇది కూడా రైతులకు వర్తించని పరిస్థితికి తెచ్చారని మండిపడ్డారు. రూ.93 వేల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని తమపై బురద జల్లే ప్రయత్నం చేశారని, ఇప్పుడు మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు వెచ్చించడంలో మర్మం ఏంటో ప్రజలు తెలుసుకుంటున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో 38 లక్షల ఎకరాలకు రెండు పంటలకు నీళ్లు ఇచ్చామని, మూసీ నది సుందరీకరణతో ఎవరికి లాభమని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు పైసలు లేవని అంటున్న ప్రభుత్వానికి మూసీ సుందరీకరణకు ఎక్కడి నుంచి వస్తాయని నిలదీశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు రాహుల్ గాంధీకి గుర్తుకు రావడం లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై అన్ని వర్గాల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉందని, కార్యకర్తలు వారి ముందు నిలిచి కలిసి కట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. పోలీసులు అతిగా ప్రవర్తించవద్దని, రేవంత్‌రెడ్డి పర్మినెంట్ కాదని, తమ పార్టీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడితే ఆంధ్రప్రదేశ్‌లోలాగా రాబోయే రోజుల్లో విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

### మరో పోరాటానికి రసమయి సిద్ధం

దసరా పండుగ అంటే ఆనాడు పాండవులు తమ ఆయుధాలను జమ్మిచెట్టు మీది నుంచి కిందికి దించారని.. ఈ రోజు రసమయి బాలకిషన్ కూడా ధూంధాం.. అలయ్ బలయ్ పేరిట తన పాట అనే ఆయుధంతో కాంగ్రెస్‌పై పోరాటానికి సిద్ధవుతున్నాడని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రం మొత్తంలో ధూంధాం పెట్టి 25 ఏండ్లు అవుతున్నదని. ఆనాడు ఆ కార్యక్రమం తెలంగాణ ప్రజల్ని ఒకటి చేసిందని, తన పాట, మాటలతో కళాకారులందరు తెలంగాణ కోసం ప్రజల్ని సమాయత్తం చేశారని గుర్తు చేశారు. మరోసారి కాంగ్రెస్ నాయకుల మెడలు వంచేందుకు రసమయి మరోసారి పోరాట గళాన్ని వినిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, రావుల రమేశ్, గడ్డం నాగరాజు, ఇనుకొండ జితేందర్‌రెడ్డి, సిద్ధం వేణు, తదితరులు పాల్గొన్నారు.

### ఓటములు మనకు కొత్తకాదు



బీఆర్‌ఎస్ పార్టీకి ఓటములు కొత్త కాదు. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటేనే రెండు సార్లు ప్రభుత్వంలోకి వచ్చాం. పది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విరక్తి వచ్చింది. అదృష్టవశాత్తు వర్షాలు సమృద్ధిగా కురిశాయి. లేకపోతే కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరిగే పరిస్థితే ఉండేది కాదు. ఆనాడు వైఎస్సార్ వంటివారినే తట్టుకుని కేసీఆర్ బీఆర్‌ఎస్‌ను నడిపించారు. ఇప్పుడున్న వారు పెద్ద లెక్క కాదు. ఎన్నో ఏండ్ల కష్టంతో రాష్ట్ర ఏర్పాటుతోపాటు అధికారం సాధ్యమైంది. నేను యువకుడిగా ఉన్నప్పుడే.. నాడు బలమైన శక్తిగా ఉన్న ప్రస్తుత మంత్రి కొండా సురేఖపై కేసీఆర్ నన్ను ఎంపీగా పోటీలోఉంచారు. ప్రజలు బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించారు. ఇలాంటి పరిస్థితులు మళ్లీ వస్తాయి. ప్రజలకు ఎక్కడ సమస్య వచ్చినా అండగా ఉంటూ ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నాం.

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

### కవ్వంపల్లి కాదు.. కమీషన్ల సత్యనారాయణ



మానకొండూర్ నియోజకవర్గంలో వసూళ్ల పర్వం కొనసాగుతున్నది. దందాలపై సోషల్‌మీడియాలో పోస్టులు పెడితే మన్నెంపల్లికి చెందిన సదిగౌడ్ అనే యువకుడిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేశారు. నియోజకవర్గంలో ఇలాంటి బాధితులు ఎంతో మంది ఉన్నారు. అయినా, ఏ ఒక్క కార్యకర్త భయపడడు.మనందరికీ హరీశన్న అండగా ఉంటారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి కాదు.. కమీషన్ల సత్యనారాయణ. ఇప్పటికే రూ.వంద కోట్ల వసూళ్లు పూర్తి చేశారు. ఇంకెన్ని కోట్లు వసూలు చేస్తారో. అబద్ధాన్ని ప్రశ్నించాలి. నిజాన్ని బతికించుకోవాలి. రాబోయే స్థానిక సంస్థల్లో అన్ని పదవులు మనవే. పది నెలల్లో ఒక్క శిలాఫలకం పెట్టలేదు. తిమ్మాపూర్ యాదవుల పల్లిలో పెట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ కుంటలో కడుతున్నారు. హైదరాబాద్‌లో హైడ్రాతో భయపెడుతున్న ప్రభుత్వం.. ఇక్కడ కుంటలో స్కూల్ ఎట్ల కడుతున్నది. నాయకులు, కార్యకర్తలు కలిసిమెలిసి పని చేసుకోవాలి. ఎలాంటి తగాదాల జోలికి వెళ్లవద్దు. నేను వారంలో నాలుగు రోజులు ఇక్కడే ఉంటా. ఏ సమస్య వచ్చినా మీవెంట నేనున్నా.

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

